క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని పూజితతో పీడీ సురేష్

లేపాక్షి: స్థానిక నీలం సంజీవరెడ్డి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బి.పూజిత రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వీవీసి గిరి, ఫిజికల్ డైరెక్టర్ సురేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. త్వరలో గుంటూరు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-17 ఫుట్‌బాల్ పోటీల్లో అనంతపురం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు.

అన్నదాన సత్రం నిర్మాణానికి కృషి



అన్నదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం: సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో 73వ రోజు నిత్యాన్నదాన కార్యక్రమం జరిగింది. గురువారం స్థానిక రైల్వేరోడ్డు కేవీఆర్ ఫంక్షన్ హాల్ వద్ద 556 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. అలాగే సేవాకర్తలు బబ్లూ ఫ్యాన్సీ స్టోర్ నిర్వాహకులు 300 ఫైబర్ ప్లేట్లు అందజేశారు. ఈ సందర్భంగా సద్గురు యోగి నారాయణ సేవా సమితి ప్రెసిడెంట్ రవిశంకర్ మట్లాడుతూ.. దాతల సహకారంతో నిరంతరం ఆకలితో ఉన్న వారికి అన్న ప్రసాదం పంపిణీ చేయాలనే లక్ష్యంతో మహాయజ్ఞం ప్రారంభించామన్నారు. ప్రభుత్వం స్పందించి స్థలాన్ని కేటాయిస్తే అన్నదాన సత్రం నిర్మించాలని సంకల్పించామన్నారు. ఇందుకు పట్టణ ప్రముఖులు, దాతలు ప్రతి ఒక్కరు ఒక సహకరించాలన్నారు. కార్యక్రమంలో దాత బబ్లూ సెట్ మిత్ర బృందం కడ్లప్ప, హరి, వెంకటరామప్ప, నాగరాజు, మహేష్ పాల్గొన్నారు.

వరద బాధితులకు సరుకుల సరఫరా

పెనుకొండ: విజయవాడ వరద బాధితులకు స్థానిక బీజేపీ నాయకులు గురువారం సరుకులను పంపించారు. ఇటీవల నాయకులు పట్టణంలో సరుకులు సేకరించారు. ఈసందర్భంగా పార్టీ నేత గోపీనాథ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు జీఎం. శేఖర్ చేతుల మీదుగా సరుకులను కిట్లుగా తయారు చేసి వాహనంలో పంపించారు. బియ్యం, కందిపప్పులు, బెల్లం, చింతపండు, ఆయిల్ తదితర సరుకులను పంపించినట్లు నాయకులు తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ రాఘవయ్య

అమరాపురం: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ రాఘవయ్య సూచించారు. గురువారం స్థానిక శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన 8, 9, 10 తరగతుల హాజరు పట్టికను పరిశీలించారు, ఆన్‌లైన్, మానువల్ రిజిష్టర్లను తనిఖీ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు గణితం బోధన చేయడంతో పాటు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ప్రతి విద్యార్థీ బాగా చదువుకుని వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ కాంతరాజు, హెచ్‌ఎం అనితాలక్ష్మి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

అమరాపురం: మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని మద్దనకుంటలో రోడ్డుకిరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ పథకం కింద మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా పర్యావణాన్ని సంరక్షించ వచ్చన్నారు. అనంతరం నగోనపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీడీ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ భాస్కర్, ఏపీఓ జగదీష్ పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



ప్రతిభ కనబరచిన రొళ్ల మండలం ఎం.రాయాపురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన రొళ్ల మండలం దొమ్మరహట్టి గురుకుల పాఠశాల విద్యార్థులు



గుడిబండ: జిల్లాస్థాయి ఎంపికైన రాళ్లపల్లి పాఠశాల విద్యార్థులు

రొళ్ల: మండలం లోని ఎం.రాయాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు దొమ్మరహట్టి గ్రామ సమీపాన ఉన్న అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు తాలూకా స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ వాలీబాల్, వివిధ అథ్లెటిక్స్ క్రీడాపోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు గురువారం ప్రిన్సిపాల్ మైలారప్ప, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుధాకర్ తెలిపారు. ఎం.రాయాపురం జెడ్పీహెచ్ఎస్ చెందిన అండర్-17 బాలికల విభాగంలో ఎం.యమున, ఆర్.నవేదిత, వాత్సల్య, తబిత, వరలక్ష్మి, అమూల్య, బాలుర విభాగంలో అండర్-17 విభాగంలో ఆకాష్, వేణుగోపాల్, సంతోష్‌తో పాటు అండర్-14 బాలికల విభాగంలో లక్ష్మీత, లక్ష్మీప్రియ, గౌతమి, శృతి, ఐశ్వర్య, మానసతో పాటు అండర్-14 బాలుర విభాగంలో సి.మధు ఎంపికయ్యారు. అలాగే అంబేడ్కర్ బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులు వివిధ అథ్లెటిక్స్ క్రీడా పోటీలో ప్రతిభను కనబరచి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. సాయంత్రం ఆయా పాఠశాల ఆవరణలో విద్యార్థులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించే కార్యక్రమాన్ని చేపట్టారు. త్వరలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో కూడా ప్రతిభను కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ చంద్రశేఖర్, పీఈటీ వెంకటనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక..

గుడిబండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు మడకశిర నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుడిబండ, రాళ్లపల్లి విద్యార్థినీ విద్యార్థులు సత్తా చాటి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. సీనియర్ విభాగంలో భార్గవి, వర్షిత, షాఫీర్, సాగర్, సందీప్, జూనియర్ విభాగంలో అరుణ్, హర్షవర్ధన్, లక్ష్మీకాంత్ జిల్లా స్థాయిలో వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు రాళ్లపల్లి, గుడిబండ పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి, గోవిందప్ప అభినందించారు.

కొనసాగిన క్రీడలు..

లేపాక్షి: స్థానిక మహాత్మాజ్యోతిబా పూలే ఏపీ గురుకుల పాఠశాలలో గురువారం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో 100, 200, 400, 600, 800, 1500 మీటర్ల పరుగు పందెం పోటీలు, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొదటి, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామని నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సురేష్ తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ మొరార్జీ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు శివకుమార్, మూడు మండలాల పీఈటీలు పాల్గొన్నారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి పోటీలు

పరిగి: కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆటల పోటీలు గురువారం ముగిశాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదతర పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా గెలుపొందిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు, ఆయా పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



లేపాక్షి: పరుగు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పరిగి: వాలీబాల్ ఆడుతున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రేపు ఆలయాల్లో పూజలు

గుడిబండ/రొళ్ల: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ తిరుమల పవిత్రత, ప్రసాదం విశిష్టతను చంద్రబాబు అపవిత్రం చేసినందుకుగానూ.. ఆ పాప ప్రక్షాళన కోసం ప్రత్యేక పూజలు నిర్వహించాలని మాజీ సీంఎ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారన్నారు. అలాగే రొళ్లలో శనివారం మధ్యాహ్నం 1 గంటకు కొత్తపాళ్యం వేంకటేశ్వరస్వామి ఆలయం వరకూ బైక్ ర్యాలీ నిర్వహిస్తామని జెడ్పీటీసీ అనంతరాజు, పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు, వివిధ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు, జేసీఎస్, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ ముఖ్య నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ధర్మవరం రూరల్: పోతుకుంట గ్రామం వద్ద గురువారం స్కార్పియోను ఆటో ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు.. కుణుతూరు గ్రామానికి చెందిన అఖిలానంద రెడ్డి, జనార్దన్, యశ్వంత్‌రెడ్డి ఆటో డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. ధర్మవరం నుంచి పోతుకుంట వైపు వేగంగా వెళ్లారు. ఈక్రమంలో ఎదురుగా వచ్చిన స్కార్పియో వాహనాన్ని ఢీకొట్టారు. ఆటోను తప్పించే క్రమంలో స్కార్పియో వాహనం రోడ్డు పక్కన వున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఘటనలో ముగ్గురూ స్వల్పగాయాలతో బయటపడ్డారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌ఎస్ అధికారి రంగనాయకులు

హిందూపురం టౌన్: స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో నూతన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవా, అంతర్జాతీయ యువ దినోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. భారత ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడిచే జాతీయ సేవా పథకంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌గా చేరడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ యువ సమ్మేళనాల్లో పాల్గొనే అరుదైన అవకాశం కలుగుతుందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ పథకంలో చేరి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లుగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, అధ్యాపకులు శ్రీధర్, యశోదారాణి, పార్వతి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ శ్రీలక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు, కళాశాల సీనియర్ అసిస్టెంట్ నరసింహులు పాల్గొన్నారు.

సజావుగా దుకాణాల వేలం



బహిరంగ వేలం నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన మున్సిపల్ దుకాణాల బహిరంగ వేలం సజావుగా నిర్వహించారు. మున్సిపల్ అధ్యక్షుడు పీహెచ్ రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో సుమారు 300 మంది పాల్గొన్నారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండు వెనుక ఉన్న 34 దుకాణాలకు బహిరంగ వేలం వేశారు. అత్యధికంగా 21వ నంబరు దుకాణాన్ని రూ.24 వేలకు పాడగా, అత్యల్పంగా 2వ నంబరు దుకాణాన్ని రూ.5,600 కు పాడారు. వేలంలో మున్సిపాలిటీకి దాదాపు రూ.60 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. 12 నెలలకోసారి నిర్వహించాల్సిన దుకాణాల బహిరంగ వేలం గతంలో నిలిపి వేయాల్సిందిగా వ్యాపారులు కోర్టును ఆశ్రయించి స్టే తీసుకు రావడంతో.. 24 నెలల అనంతరం వేలం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్, మున్సిపల్ అధ్యక్షుడు రాజేశ్, ఉపాధ్యక్షురాలు గీత, కౌన్సిలర్లు సుదేశ్ బాబు, టెంకాయల రవి, రామాంజినప్ప, సుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అందించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

లేపాక్షి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు కళాశాలకు వస్తున్నారన్నారు. చాలా మంది మధ్యాహ్నం భోజనం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తప్పనిసరిగా మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని కోరారు. అనంతరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రమీళమ్మకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు దేవరాజ్, పవన్, వసంత్, జాహిద్, నూర్, గిరి, అమీన్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడొద్దు



సంతలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ అధికారి శివశంకర్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన వారపు సంతలో ఆయన పలు దుకాణాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు తూకాలు, కొలతలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా వినియోగదారులు మోసపోతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కాగా తనిఖీలు జరుగుతున్నాయని తెలుసుకొని పలు షాపుల యజమానులు తమ దుకాణాలకు కొద్దిసేపు బంద్ చేశారు.

దోమల నివారణకు ఫాగింగ్



మణూరులో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని మణూరు గ్రామంలో దోమల నివారణకు గురువారం రాత్రి మురికి కాలువలు, వీధుల్లో పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు. గ్రామంలో దోమల బెడద తీవ్రంగా ఉందని రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దోమల బెడద నివారించాలని గ్రామస్తులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ఆనంద్ కుమార్ కార్మికులతో ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి ప్రహరీ నిర్మించండి

మడకశిర రూరల్: మండలంలోని కదిరేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ నిర్మించి విష పురుగుల ప్రవేశించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. కదిరేపల్లి పీహెచ్‌పీ కొండ సమీపంలో ఉండడంతో విషపురుగుల బెడద అధికంగా ఉందన్నారు. పహరీ లేకపోవడంతో రాత్రి సమయంలో మరింతగా ఇబ్బందిగా ఉందన్నారు. గతంలో ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి వైద్య సిబ్బంది తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం స్పందించి ప్రహరీ నిర్మించి, విషపురుగుల బెడద తప్పించాని ప్రజలు కోరుతున్నారు.

పచ్చదనం పెంపొందించాలి



బస్టాండ్ పరిసరాల్లో మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

హిందూపురం: పర్యావరణ పరిరక్షణకు పచ్చదనాన్ని పెంపొందించాలని బాలయేసు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జియావుల్లా ఖాన్, పర్యావరణ పరిరక్షణకర్త భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో బాలయేసు డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు చెత్త తొలగింపు, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లోని పిచ్చి మొక్కలను తొలగించి ప్లాస్టిక్, వ్యర్థాలను తొలగించారు. అనంతరం బస్టాండ్ గ్యాలరీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఏడీసీ ఓంకార మూర్తి, నాయక్, చెన్నారెడ్డి, విద్యార్థి నాయకులు చంద్రా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అశ్వర్థ నారాయణ, హరీష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాన్ని ఆపండి

పెనుకొండ: పట్టణంలోని జీబీసీ కాలనీ 1వ రోడ్డు(ప్రగతి పాఠశాల) సమీపంలో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి, కాంపౌండ్ పనులను మున్సిపల్ అధికారులు వెంటనే ఆపాలని స్థానికులు కోరుతున్నారు. గురువారం కాలనీవాసులు సురేష్‌బాబు, గిరి, జగదీష్, లక్ష్మీదేవి, బాబు మాట్లాడుతూ రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణం చేపట్టారన్నారు. గతంలో పనులు ఆపాలని నగర పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకున్నారన్నారు. అయితే ప్రభుత్వం మారడంతో మళ్లీ నిర్మాణం ప్రారంభించారన్నారు. అధికారులు స్పందించి పనులు ఆపాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మడకశిర రూరల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ మలేరియా ఆఫీసర్ షమీఉల్లా అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం కల్లుమర్రి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఉప్పిడిపిల్లి గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మురికి కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ వేయించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలలో పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగీ, దోమల నివారణ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు మాధుర్య, వినోద్‌కుమార్, కార్యదర్శి ఆనంద్ కుమార్, పీహెచ్‌సీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సత్కరించిన జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సభ్యులు

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న జీఎంఆర్ రక్షా అకాడమీ అనుబంధ సంస్థ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం టేకులోడు క్రాస్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 20 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి, వరలక్ష్మి ఫౌండేషన్ వారు అవార్డులతో సత్కరించారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. పేద మధ్య తరగతి విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్న ఉపాధ్యాయులను ప్రోత్సహించేందుకు ఏటా ఈ అవార్డులను అందజేస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా టైలరింగ్ శిక్షణ తీసుకున్న 11 మంది గృహిణులకు ప్రమాణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు వరలక్ష్మి ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాస్, ఎంజేపీ ప్రిన్సిపాల్ శోభారాణి, జీఎంఆర్ రక్షా ఉద్యోగులు రమాశ్రీ, ప్రభాకర్‌రెడ్డి, షాహిద్, రియాజ్, శాంతరాజు, టైలరింగ్ కోచ్ లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించండి



ఆందోళన నిర్వహిస్తున్న వీఏఓలు

పావగడ: పని ఒత్తిడి తగ్గించి ఆరోగ్యం కాపాడాలని తాలూకా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న వీఏఓ (విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు)లు తాలూకా కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూకా వీఏఓల సంఘం అధ్యక్షుడు రంజిత్‌కుమార్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ముఖ్యంగా మొబైల్ యాప్‌లలో ఏక కాలంలో అభివృద్ధి సాధించడం తీవ్ర మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. అంతేకాకుండా వీఏఓలకు 30 సంవత్సరాల నుంచి పదోన్నతులు కల్పించలేదన్నారు. వీఏఓల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని లేని పక్షంలో జిల్లా కేంద్రాలు అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామలింగయ్య, కిరణ్ కుమార్,షణ్ముఖరాధ్య, అరుణ్ కుమార్, తిమ్మారెడ్డి, శ్రీలక్ష్మి, ఉష పాల్గొన్నారు.

గుణాత్మక విద్యనందించండి



ఎగువ గంగంపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ గోపాల్

గోరంట్ల: విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని ఎంఈఓ- 2 గోపాల్ ఉపాధ్యాయులకు సూచించారు. చౌండూరివాండ్లపల్లి, ఎగువ గంగంపల్లి, గోపిదేవరపల్లి, అస్పత్రి ప్రాథమిక పాఠశాలలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయా పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. సమయ పాలన పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఉపాధ్యాయులను హెచ్చరించారు. హెచ్చారించారు. మధ్యహ్న భోజన నిర్వహకులు మెనూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

'పీఎం సూర్యఘర్' వినియోగించుకోండి

హిందూపురం: పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భూపతి తెలిపారు. గురువారం పట్టణంలోని పాండురంగ నగర్‌కు చెందిన ప్రతిభ ఓబులేసు మిత్రకు 25 ఏళ్ల కాలానికి విద్యుత్ కొనుగోలుకు ఒప్పందపత్రం అందజేశారు. సోలార్ సిస్టం ద్వారా నెలకు 400 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. తద్వారా ఇంటి బిల్లు 90 శాతం ఆదా అవుతుందని పేర్కొన్నారు. సోలార్ సిస్టం అమర్చు కోవడం వల్ల పర్యావరణ పరిరక్షణతోపాటు రూ.78 వేలు సబ్సిడీ అందుతుందన్నారు. మిగులు విద్యుత్తును గ్రిడ్‌కు సరఫరా చేయడం ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ అబ్దుల్ రహీం, ఎఈలు విష్ణు, లక్ష్మీకాంత్ రెడ్డి, ట్రాన్స్‌సస్‌మిత్ర సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

పరిగి: బిందూనగర్‌లో గురువారం అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు. దొడ్డయ్య అనే వ్యక్తిని పట్టుకుని 45 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను సీజ్ చేశామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220717, 9912220723, 9705346587
9010200238, 9912220726